అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే

- మచిలీపట్నంలో ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నానికి తేలనున్న అంచనాలు
- అభ్యర్థులు, ఓటర్లలో ఉత్కంఠ



కృష్ణా యూనివర్సిటీలో కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

అవనిగడ్డ: మచిలీపట్నం పార్లమెంట్, మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో లెక్కింపు జరుగనుంది. ఓట్ల లెక్కింపులో భాగంగా మొదట పోస్టల్ బ్యాలెట్ల ద్వారా వచ్చిన ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు గెలుపు అంచనాలు లెక్కలు తేలే అవకాశం ఉంది. మచిలీపట్నం పార్లమెంట్ బరిలో 15 మంది ఉన్నారు. మే 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో 12,93,935 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 21,728 ఓట్లు పోలయ్యాయి. అవనిగడ్డ నియోజకవర్గంలో 1,82,991 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 91,116 మంది పురుషులు, 91,867 మహిళలు, 8 మంది ఇతరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అవనిగడ్డ బరిలో 12 మంది..

పోస్టల్ బ్యాలెట్ ద్వారా మొత్తం 3,825 ఓట్లు వచ్చాయని ఆర్వో బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. వీటిలో పోస్ట్ ద్వారా వచ్చినవి 45 ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 12 మంది అభ్యర్థులు రంగంలో ఉండగా ప్రధానంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు, జనసేన తరుపున కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న మండలి బుద్ధప్రసాద్ మధ్య పోటీ ఉంది. ఘంటసాల మండలం శ్రీకాకుళం ఒకటో పోలింగ్ బూత్ నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 1 నుంచి 44 బూత్ వరకే ఘంటసాల మండలం, 45 నుంచి 94 వరకూ చల్లపల్లి, 95 నుంచి 132 వరకూ మోపిదేవి, 133 నుంచి 170 వరకూ అవనిగడ్డ, 178 నుంచి 215 వరకూ కోడూరు, 219 నుంచి 267 వరకూ నాగాయలంక మండలంలో లెక్కింపు కార్యక్రమం జరుగుంది. ఈ మండలంలోని ఎదురుమొండి పంచాయితీ పరిధిలోని కృష్ణాపురం 267 పోలింగ్ బూత్ చివరిగా లెక్కించనున్నారు. మొత్తం 20 రౌండ్లలో ఎన్నికల ఫలితాలు వెలువడనుంది. ఘంటసాల మండలం శ్రీకాకుళం తొలి రౌండ్.. నాగాయలంక మండలం కృష్ణాపురం చివరి రౌండ్ ఫలితం వస్తుంది.

పెడనలో 10 మంది..

గూడూరు: పెడన నియోజకవర్గంలో మొత్తం 1,67,564 ఓట్లకు గాను 1,48,413 ఓట్లు పోలయ్యాయి. వీటిలో పురుషుల ఓట్లు 74384 పోలవ్వగా, మహిళా ఓట్లు 74,029 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1708 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల బరిలో 10 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా ప్రధానంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) కూటమి తరపున బరిలోకి దిగిన టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌ల మధ్యే ప్రధాన పోటీ నెలకొని ఉంది. నియోజకవర్గంలో 216 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఒక్కో రౌండుకు 14 టేబుళ్ల చొప్పున 16 రౌండ్లలో పెడన నియోజకవర్గ ఫలితం లెక్కించనున్నారు. మొట్టమొదటగా గూడూరు మండలం ముక్కొల్లులోని 1వ నంబరు బూత్ నుంచి ఓట్లలెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. నాలుగు రౌండ్లలో గూడూరు మండలంలోని 56 పోలింగ్ బూత్‌ల లెక్కింపు పూర్తవుతుంది. ఐదవ రౌండ్ నుంచి పెడన మండలంలోని (57వ పోలింగ్ బూత్‌లోని) చెన్నూరుతో ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. 5,6,7 రౌండ్లలో పాటుగా 8వ రౌండ్‌లోని రెండు టేబుళ్ల ద్వారా (పోలింగ్ బూత్ 100) నడుపూరుతో పెడన మండలం లెక్కింపు ముగుస్తుంది. 8వ రౌండ్‌లోని మూడో టేబుల్ నుంచి పెడన పట్టణం(101 బూత్) ఓట్ల లెక్కింపు ప్రారంభమై 9వ రౌండ్ 13వ టేబుల్‌తో (125వ బూత్) పట్టణ ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ముంజులూరు(126 బూత్) నుంచి బంటుమిల్లి మండలం ఓట్ల లెక్కింపు 9వ రౌండ్ 14వ టేబుల్ నుంచి ప్రారంభమై 13 రౌండ్ రెండో టేబుల్ (చోరంపూడిలోని 170 పోలింగ్ బూత్)తో పూర్తవుతుంది. 13వ రౌండ్‌లోని మూడో టేబుల్‌తో మునిపెడ(బూత్ నంబర్171) నుంచి కృత్తివెన్ను మండలం ఓట్ల లెక్కింపు ప్రారంభమై చిట్టచివరిగా ఏటిమొండి (బూత్ నెంబర్ 216)తో 16వ రౌండ్ ఆరో టేబుల్ ఓట్ల లెక్కింపు ముగుస్తుంది. పోస్టల్ బ్యాలెట్లతో కలిపి ఎవరికీ ఎన్ని ఓట్లు వచ్చాయన్న ఫలితాన్ని పెడన ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటిస్తారు. అనంతరం గెలిచిన అభ్యర్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

మచిలీపట్నం బరిలో 14 మంది..

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నియోజకవర్గంలో 1,96,680 మంది ఓటర్లు ఉండగా 1,61,109 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 78,103 మంది పురుషులు కాగా 83,001 మంది మహిళలు, ఐదుగురు ఇతరులు ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర మధ్య ప్రధాన పోటీ ఉంది. ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమం 15 రౌండ్లలో లెక్కింపు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకు అనుగుణంగా కృష్ణా విశ్వవిద్యాలయంలో ఈ లెక్కింపు కేంద్రానికి అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం 205 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆయా బూత్‌ల వారీగా మొదట మండల పరిధిలోని పెదపట్నం గ్రామం నుంచి ప్రారంభమవుతుందని చివరిగా మండల పరిధిలోని కెపీటీ పాలెం గ్రామంతో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్లు 3,977..

సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు 3,977 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 3,318 ఓట్లు ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 122 మంది ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును వేశారు. హోం ఓటింగ్ విధానంలో 192 మంది, ఇతర జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు 327 మంది, సర్వీసు ఓటర్లు 28 మందితో మొత్తం 3,977 మంది పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం



పెడన: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పెడన నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి(ఆర్వో) పి.వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను ఆయన పునఃపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆయా పార్టీలకు సంబంధించిన అభ్యర్థులను, ఏజెంట్లను ఆర్వో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములోని పోస్టల్ బ్యాలెట్లను తీసుకురావడానికి సమాచారం ఇచ్చామన్నారు. లెక్కింపు ఏజెంట్లకు, అభ్యర్థులకు లెక్కింపు సందర్భంగా అనుసరించాల్సిన నియమ, నిబంధనలపై అవగాహన కలిగించామని ఆర్వో పేర్కొన్నారు. లెక్కింపు పూర్తి అయ్యేవరకు కేంద్రం నుంచి ఏజెంట్లు, సిబ్బంది ఎవరు బయటకు వెళ్లకూడదని ఆయన చెప్పారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలట్ల లెక్కింపు మొదలు అవుతుందన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు సమయపాలన పాటించాలని అలాగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేందుకు సహకరించాలని ఆర్వో వెంకటరమణ కోరారు.

185 మందికి హోమియో వైద్యం

చల్లపల్లి: చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక సీఆర్ వికాస కేంద్రంలోని హోమియో సెంటర్‌లో ప్రముఖ హోమియో వైద్యులు సోమవారం 185 మందికి పరీక్షలు చేసి అవసరమైన మందులు ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందజేశారు. శిబిరాన్ని వికాస కేంద్రం పెద్దలు మేకా నరసింహారావు, అడ్డాడ ప్రసాద్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు



బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి, నాగేశ్వరరావుపేట గ్రామాల్లోని కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి మందిరాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మూడో రోజైన సోమవారం స్వామివార్లకు విశేష పూజలు, లక్ష్మీగణపతి హోమాలను పలువురు దంపతుల పాల్గొని నిర్వహించారు. నాగేశ్వరరావుపేట మందిరం వద్ద ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మందిర కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు, సభలు నిషేధం

కూచిపూడి(మొవ్వ): ఎన్నికల కౌంటింగ్, ఫలితాల అనంతరం ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు పూర్తి నిషేదం అని కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో సోమవారం మొవ్వ మండలం కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ప్రజలు పాటించాల్సిన రూల్స్‌పై ముందస్తు హెచ్చరికలు ఎస్ఐ జారీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్, 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఏ ప్రదేశంలో నలుగురు కన్నా ఎక్కువ మంది ఒకే ప్రదేశంలో గుమికూడ వద్దన్నారు. బైక్‌లపై పెద్ద శబ్దాలు చే యటం, బాణ సంచా కాల్చటం, డీజే ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బంటుమిల్లి: ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని యోగాశక్తి సాధనా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. 10వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 21 రోజుల పాటు యోగా శక్తి చికిత్స అనే అంశంపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన అనారోగ్యానికి, అకాల మరణాలకు కారణమవుతున్న పలు విషయాలను వివరించారు. సమాజంలో వస్తున్న ఆహార అలవాట్ల కారణంగా వస్తున్న అనారోగ్యాలను అరికట్టి ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందచేయడంలో యోగా, సనాతన సంప్రదాయ వైద్యమే ఆధారమైందన్నారు. యోగా సాధన ద్వారా ప్రాణశక్తిని ఉపయోగించి రోగాన్ని నయం చేసుకోవచ్చని చెప్పారు. ఏఏ వ్యాధికి ఏఏ నరాలను ఏ విధంగా ఉపయోగిస్తే సంబంధిత జబ్బు నయం అవుతుందో ఆక్యుప్రెజర్ వైద్యం ద్వారా శిక్షణ ఇచ్చారు. శిబిరంలో కరాటే మాస్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, రైతు సంఘ కన్వీనర్ ఎల్.అజయ్‌ఘోష్ పాల్గొన్నారు.

రామరాజుపాలెంలో జేసీబీ సీజ్

గూడూరు: నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలపై గూడూరు తహసీల్దార్ ఎస్.ఎస్.శాంతి ఉక్కు పాదం మోపుతున్నారు. ఆదివారం కప్పలదొడ్డి, నారికేడాలపాలెం గ్రామాల్లో మట్టి తవ్వకాలపై విచారణ నిర్వహించి, బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదులు చేయించిన విషయం విదితమే. కాగా రామరాజుపాలెంలో ఆదివారం రాత్రి సమయంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఆమె వెంటనే రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘటనా స్థలానికి సిబ్బందితో వెళ్లిన వీఆర్వో కె.వెంకటేశ్వరరావు గ్రామంలో మట్టి తవ్వుతున్న జేసీబీని గుర్తించి తవ్వకాలను అడ్డుకున్నారు. అంతే కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీని సీజ్ చేసి గూడూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై మైనింగ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో రూ.7 వేల జరిమానా విధించారు. గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలపై తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మోపిదేవిలో మజ్జిగ పంపిణీ



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడి సెంటర్‌లో భక్తులకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల సంఘం పూర్వ విద్యార్థులు, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం మజ్జిగను ఆర్ఐ సునీల్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పండుటాకులకు తప్పని తిప్పలు



కోడూరులో ఎస్‌బీఐ వద్ద లబ్ధిదారుల పడిగాపులు



ఘంటసాల స్టేట్ బ్యాంకులో పెన్షన్ కోసం క్యూలో ఉన్న పెన్షన్‌దారులు

కోడూరు/ఘంటసాల: పింఛన్‌దారులకు ఈ నెల కూడా పెన్షన్ కష్టాలు తప్పలేదు. జూన్ నెలకు సంబంధించిన పెన్షన్‌ను ప్రభుత్వం డీబీటీ పద్ధతి ద్వారా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో ఆ నగదును తీసుకొనేందుకు లబ్ధిదారులు సోమవారం బ్యాంకులు, ప్రైవేటు కస్టమర్ పాయింట్ల వద్ద బారులు తీరారు. ఘంటసాల, కోడూరుతో పాటు అన్ని మండలాల్లోని బ్యాంకుల వద్ద ఉదయం 9 గంటల నుంచే వృద్ధులు పెన్షన్ నగదు కోసం పడిగాపులు పడ్డారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో వలంటీర్ల ద్వారా పెన్షన్ నగదును నేరుగా లబ్ధిదారుడి ఇంటికి పంపడంతో చాలా మంది వృద్ధులు, ఒంటరి మహిళలు కనీసం బయటకు రాని పరిస్థితి. పెన్షన్ నగదు కోసం ఐదేళ్ల నుంచి ఏవిధమైన ఇబ్బందులు పడలేదని, కానీ ఇప్పుడు ఎన్నికల వల్ల ఇన్ని కష్టాలు వచ్చి పడ్డాయని వృద్ధులు అసహనం వ్యక్తం చేశారు. ఒకటో తేదీన వచ్చే పెన్షన్ మూడో తేదీ అయినా కూడా చేతికి రాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



చల్లపల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ మురళీధర్



కోడూరులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎస్ఐ శిరీష

చల్లపల్లి: ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ డీఎస్పీ పీ.మురళీధర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పురవీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్ 144, సెక్షన్ 30 అమలులో ఉన్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ గుంపులుగా తిరగటం కానీ, అసాంఘిక ఘటనలకు తావిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ సీహెచ్.నాగప్రసాద్, ఎస్ఐ సీహెచ్.చినబాబు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం సీఐ నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రధాన కూడలిలో ముళ్ల కంచె వేసి ఎన్నికల ఫలితాల సందర్భంగా చేపట్టే చర్యలు వివరించారు.

కోడూరులో మాక్ డ్రిల్

కోడూరు: ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకొని రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శిరీష హెచ్చరించారు. సోమవారం కోడూరులో స్థానిక సిబ్బందితో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక సిబ్బందితో గస్తీ చేపట్టామన్నారు. కౌంటింగ్ జరిగే సమయంలో, ముగిసిన తరువాత రెచ్చగొట్టే వ్యక్తులు, కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడాన్ని నిషేధించినట్లు చెప్పారు. ప్రజలంతా తమకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

అల్లర్లు చేస్తే అరెస్ట్‌లు తప్పవు..

ఘంటసాల: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లు, అలజడి సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఘంటసాల పోలీస్ స్టేషన్ వద్ద మైక్ ప్రచారం చేసే ఆటోలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఘంటసాల మండలంలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ బాధ్యతతో మెలగాలన్నారు. ర్యాలీలకు, ఊరేగింపులకు ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. డీజేలు పెట్టరాదని, బాణ సంచాలు ఎవరూ కాల్చరాదని, బాణసంచా ఎవరైనా విక్రయించిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం, వికాసం

ఘంటసాల: విద్యతో పాటు విజ్ఞానం, వికాసం పెంపొందాలంటే గ్రంథాలయాలు తోడ్పడతాయని గ్రంథాలయాధికారి ఎమ్.శరత్ కుమార్ తెలిపారు. ఘంటసాల గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలు, పుస్తక పఠనం చదివించిన అనంతరం లైబ్రేరియన్ శరత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. కొడాలి గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థుల చేత కథలు పుస్తకాలు చదివించి వారితో కథలు చెప్పించారు. అనంతరం విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో విద్యార్థులకు పోటీలు



ఘంటసాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

చల్లపల్లి: వేసవి విజ్ఞాన శిబిరాన్ని పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, కథలు చెప్పటం, యోగా శిక్షణ, సూర్య నమస్కారాలు చేయించారు. లైబ్రేరియన్ కె.గణేష్ కుమార్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

16 నుంచి రంగనాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేం చేసి ఉన్న శ్రీ భూ నీలా పరివార సమేత శ్రీ రంగనాయకస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ ఆదివారం ఉదయం స్వామివారిని పెండ్లికుమారునిగా చేయటంతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించటంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 17న ధ్వజారోహణ, జగజ్యోతి, 18న నృత్య బలిహరణ, వధూవరాన్వేషణం, 19న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాయకస్వామి వారి కల్యాణ మహోత్సవం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 20న స్వామివారి రథోత్సవం, 21న అవబృదోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, హనుమంత వాహనంపై స్వామివారి ఊరేగింపు, 22న శ్రీ పుష్పయాగోత్సవం (పవళింపు సేవ) వంటి కార్యక్రమాలు ఆలయ ఉప ప్రధానార్చకుడు ముత్తేవి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో నిర్వహిస్తామని చెప్పారు. 24వ తేదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రజాతీర్పును ప్రతి ఒక్కరూ స్వాగతించాలి

పామర్రు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతిఒక్కరూ స్వాగతించాలి, గౌరవించాలి, అంతేగాని రెచ్చగొట్టే, కవ్వింపు చర్యలకు పాల్పడరాదని కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ పేర్కొన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఎస్పీ సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు వరకు ప్రచారాలు, ఓటర్లను ఆకర్షించేందుకు ఎన్నో మార్గాలను అనుసరించినా కౌంటింగ్ రోజున ప్రశాంతంగా ప్రక్రియ ముగించేలా అందరూ సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా వదిలి పెట్టేది లేదన్నారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయన్నారు. వాటిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. కౌంటింగ్ రోజున బాణసంచా విక్రయాలు, బాటిళ్లలో పెట్రోలు అమ్మకాలను రద్దు చేశామన్నారు. మద్యం విక్రయాలను నియంత్రించే చర్యలు చేపట్టామన్నారు. సోమవారం సాయింత్రం ఐదు గంటల నుంచి ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటల వరకు సెక్షన్ 144, 30 అమల్లో ఉంటాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

హోరాహోరీ పోరులో సొర్లగొంది టీమ్ విజేత



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శివవర్మ, కమిటీ పెద్దలు

సంగమేశ్వరం(నాగాయలంక): మండల స్థాయిలో మే 14 నుంచి గ్రామ కమిటీ, గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 14 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీ సొర్లగొంది – సంగమేశ్వరం జట్లు నడుమ జరిగిన హోరాహోరీ పోరులో సొర్లగొంది టీమ్ విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాలలో సంగమేశ్వరం ఈలచెట్లదిబ్బ జట్లు నిలిచాయి. టోర్నమెంట్‌లో మెదటి స్థానంలో గెలుపొందిన జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతిని స్పాన్సర్, ముఖ్య అతిథిగా వచ్చిన మండల అగ్నికుల క్షత్రియ నేత, వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు కొక్కిలిగడ్డ శివవర్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడంలో తన వంతు సహకారం అందిస్తానన్నారు. గ్రామ సర్పంచ్ నాయుడు నాగమల్లేశ్వరి వితరణతో రెండో బహుమతి కింద రూ.15 వేలు, నాయుడు వెంకటేశ్వరరావు తృతీయ బహుమతి కింద రూ.7 వేలు విజేతలకు అందించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డుకు కేఎస్ఎస్ సీ ఫుడ్స్ ప్రకటించిన మూడు వేలు నగదు బహుమతిని అత్యుత్తమ ప్రతిభ చూపిన సొర్లగొంది క్రీడాకారుడు తమ్ము నరసింహకు అందజేశారు. పోటీలను వల్లభుని వసంతరావు, ఎస్.దావీదు, కె.బాబూరావు, ఇతర పెద్దలు, గ్రామ కమిటీ సభ్యులు నిర్వహించారు.

కౌంటింగ్ నేపథ్యంలో విధులను బాధ్యతగా నిర్వహించాలి



పోలీస్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్‌బాబు

పెడన: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా విధులను బాధ్యతగా నిర్వహించాలని మచిలీపట్నం డీటీసీ డీఎస్పీ కె.రమేష్‌బాబు సూచించారు. పెడన పోలీస్ స్టేషన్ వద్ద నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లోనూ, ప్రధాన పార్టీ కార్యాలయాల వద్ద పికెటింగ్ ఏర్పాటు చేసిన సిబ్బందితో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించి వారికి దిశనిర్దేశం చేశారు. ఇప్పటికే లెక్కింపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిర్వహించకూడదని అన్ని పార్టీల వారికి తెలియజేశామని డీఎస్పీ తెలిపారు. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమిస్తే తక్షణం ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేయాలన్నారు. ఏమాత్రం అలసత్వం ప్రదర్శించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ ప్రక్రియ నుంచి ఇప్పటి వరకూ ప్రశాంత వాతావరణం నెలకొందని ఇదే పరిస్థితి మరో రెండు రోజులుపాటు ఉండేలాగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి అందరూ నిష్పక్షపాతంగా నడుచుకోవాలని డీఎస్పీ రమేష్ సూచించారు. సమావేశంలో పెడన సీఐ నాగేంద్రప్రసాదు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా దివ్యాంగుల గుర్తింపు



గూడూరులో చిన్నారిని పరీక్షిస్తున్న అధికారులు

గూడూరు: గూడూరు భవిత కేంద్రం పరిధిలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికల గుర్తింపు ప్రక్రియ చురుగ్గా సాగుతుందని మచిలీపట్నం డీవైఈఓ బీఎస్‌సీ శేఖర్‌సింగ్ పేర్కొన్నారు. సీడబ్ల్యూఎస్ఎన్ సర్వేలో భాగంగా గూడూరు భవిత కేంద్రం పరిధిలో దివ్యాంగుల ఇంటింటి సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రతి విద్యార్థిని భవిత కేంద్రంలో చేర్పించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం వారికోసం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు అందేందుకు అవకాశం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లుతో సమన్వయం చేసుకుని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. 13 మంది చిన్నారులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, కస్తూరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి నిజపాదుకల దర్శనం



బంటుమిల్లి: మండల పరిధిలోని శ్రీ షిర్డీసాయి మందిరాల్లో సోమవారం సాయిబాబా నిజపాదుకల దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయిబాబా ప్రియ శిష్యుడైన మహల్‌సాపతికి సాయిబాబా ఆయన పాదుకలు, కఫిని, బెత్తం, 4 రూపాయి నాణేలు ఇచ్చాడు. ప్రస్తుతం మహల్‌సాపతి నాల్గవ తరానికి చెందిన శ్రీకాంత్‌నగారె గృహంలో దాదాపు 150 సంవత్సరాలుగా ఇవన్నీ భద్రపరచి ఉన్నాయి. నగారే కుటుంబం వీటికే సేవ చేసుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో బంటుమిల్లికి చెందిన జోశ్యుల శ్రీనివాస్‌తో నగారే కుటుంబానికి ఉన్న స్నేహం కారణంగా పాదుకలు బంటుమిల్లికి వచ్చాయి. షిర్డీ నుంచి విమానంలో విజయవాడకు చేరుకున్న పాదుకలను శ్రీనివాస్ అందజేసుకుని వాటిని బంటుమిల్లి తీసుకువచ్చి బంటుమిల్లి, పెందుర్రు, జానకీరామపురం, చినపాండ్రాక గ్రామాల్లో ఉన్న శ్రీ షిర్డిసాయి మందిరాల్లో ఉంచి ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చారు. పాదుకలను దర్శించుకునేందుకు పలు గ్రామాల భక్తులు బారులు తీరారు. ఈ సందర్భగా శ్రీనివాస్ మాట్లాడుతూ 3వ తేదీ రాత్రికి తిరిగి గన్నవరం విమానశ్రయం నుంచి షిర్డీ పంపుతున్నట్లు తెలిపారు.